ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 7 నవంబరు 2024



డీఎస్సీ ప్రకటన వాయిదా

సాలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనివార్య కారణాలతో మెగా డీఎస్సీ ప్రకటన వాయిదా పడింది. కొన్ని సాంకేతిక అంశాలు, అభ్యర్థుల వయసు పెంపు తదితర వాటిపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున నోటిఫికేషన్‌ను వాయిదా వేశారు. వాటిని సరిచేసి కొద్దిరోజుల్లో నోటిఫికేషన్ వెలువరించనున్నట్టు అధికారులు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఈ దఫా 446 ఖాళీలతో డీఎస్సీ ప్రకటించే అవకాశముంది. ఈ నోటిఫికేషన్ ఐదారు రోజుల్లో వచ్చే అవకాశ ముండడంతో నిరుద్యోగ అభ్యర్థులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.



వైసీపీ ఆశలపై నీళ్లు!

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు బ్రేక్
- రఘురాజుపై అనర్హత వేటును కొట్టేసిన హైకోర్టు
- ఇప్పటికే ఆ పార్టీ అభ్యర్థిగా శంబంగి

విజయనగరం/పార్వతీపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు బ్రేక్ పడింది. ఈ మేరకు హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. తాజా పరిణామంతో వైసీపీ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై అనర్హత వేటును రద్దుచేస్తూ హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. దీంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 28న జరగాల్సిన ఉప ఎన్నిక నిలిచిపోనుంది. ఈ నెల 4న ఈ ఎన్నికకు సంబంధించి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈనెల 11 వరకూ నామినేషన్లకు అవకాశం ఇచ్చింది. 28న ఓటింగ్ ఏర్పాటు చేసి..డిసెంబరు 1న ఫలితాలు వెల్లడించడానికి అన్ని సన్నాహాలు పూర్తిచేసింది. ఇంతలోనే హైకోర్టులో గతంలో రఘురాజు వేసిన పిటిషన్ విచారణకు వచ్చింది. శాసనమండలి చైర్మన్ మోసేన్ రాజు రఘురాజుపై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. దీనిని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం రద్దుచేయడంతో ఉప ఎన్నిక నిలిచిపోయినట్టే.

జరిగింది ఇదీ

2021లో ఉమ్మడి విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా వైసీపీ అభ్యర్థి ఇందుకూరి రఘురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల్లో వైసీపీకి ఏకపక్షగా బలం ఉండడం, అప్పట్లో అధికార పార్టీ కావడంతో టీడీపీ అభ్యర్థిని నిలపలేదు. దీంతో రఘురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2027 నవంబరు వరకూ ఉంది. అయితే రఘురాజు ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ టిక్కెట్ ఆశించారు. ఆయనకు అప్పట్లో మాజీ మంత్రి బొత్స అండదండలు కూడా ఉండేవి. అయితే ఆ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వైపే జగన్ మొగ్గుచూపారు. దీంతో మనస్తాపానికి గురైన ఇందుకూరి రఘురాజు మిన్నకుండిపోయినప్పటికీ ఎస్.కోట ఉపాధ్యక్షురాలు, రఘురాజు సతీమణి సుధారాజు నేతృత్వంలో ఎస్.కోట నియోజకవర్గంలోని ఐదు మండలాల రఘురాజు కేడర్ టీడీపీలోకి వెళ్లిపోయింది. రఘురాజు మాత్రం ఎన్నికల్లో సైలెంట్‌గా ఉండిపోయారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో రఘురాజు వేదిక పంచుకున్నారు. దీంతో కోపగించిన వైసీపీ ఆయనపై అనర్హత వేటు వేయాలని భావించింది. ఆ మేరకు మండలి చైర్మన్ మోసేన్ రాజుకు వైసీపీ విప్ పాలవలస విక్రాంత్ ఫిర్యాదుచేశారు. దీంతో ఈ ఏడాది జూన్ 2న రఘురాజుపై అనర్హత వేటు వేస్తూ చైర్మన్ ఉత్తర్వులు జారీచేశారు. అయితే తాను ఏ తప్పు చేయలేదని.. తన ఎమ్మెల్సీ పదవిని కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని రఘురాజు హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ ఈ రోజు విచారణకు రాగా సహేతుకమైన కారణాలు లేనందున అనర్హత వేటును కోర్టు రద్దుచేసింది. దీంతో ఇప్పటికే విడుదలైన ఉప ఎన్నికల నోటిఫికేషన్ కూడా రద్దు కానుంది.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వైసీపీ..

ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని ఎలాగైనా నిలుపుకోవాలని వైసీపీ భావించింది. ప్రతిష్మాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీని

-మిగతా 8వ పేజీలో...



అమెరికా ఎన్నికల్లో మనోళ్ల ఓట్లు

సాలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఎన్నికల్లో జిల్లాకు చెందిన కొంతమంది ఎన్‌ఆర్‌ఐలు ఈ నెల 5న ఓటు వేశారు. ఇటీవల జరిగిన పోలింగ్‌లో సాలూరుకు చెందిన ప్రసిద్ధ వైద్యుడు వాడాడ గణేశ్వరరావు కుమారుడు వాడాడ శరత్, ఆయన భార్య శాంతి పాల్గొన్నారు. న్యూయార్క్ రాష్ట్రం లాంగ్ ఐలాండ్ కౌంటీలో ఫిజియో థెరపిస్టులుగా పని చేస్తున్న వారు అమెరికా ఎన్నికల్లో ఓటు వేశారు. 'అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవగా.. ఆరుగురు ప్రవాస భారతీయులు సైతం విజయం సాధించడం భారత్‌కు అనుకూలం. చైనాకు ట్రంప్ వ్యతిరేకంగా ఉంటారు. అందువల్ల భారత్‌పై సానుకూలంగా ఉండే అవకాశముంది. అయితే ఇమ్మిగ్రేషన్‌లో కఠినంగా ఉండడం వల్ల కొంత ఇబ్బంది ఉంటుంది'. అని వారు తెలిపారు.



అమెరికాలో ఓటు వేసిన శరత్, శాంతి

అవగాహన లేక.. సౌకర్యాల్లేక

- గిరిజన గ్రామాల్లో అధికంగా శిశుమరణాలు
- వైద్య సేవలకు దూరమవుతున్న గిరిజనం
- నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినం

6లో

ముందుచూపుతోనే కట్టడి

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు
- సకాలంలో చికిత్స పొందితే సమస్య కాదంటున్న వైద్యులు
- 'మన్యం' ఆసుపత్రుల్లో కానరాని పరీక్షలు, చికిత్స
- పొరుగు జిల్లాలకు పయనం
- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం



విజయనగరం రింగురోడ్డు/కొమరాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆహారపు అలవాట్లలో మార్పులు, వక్రమార్గంలో జీవనశైలి, కాలుష్యం తదితర కారణాలతో నేడు క్యాన్సర్ విస్తరిస్తోంది. గతంతో పోల్చుకుంటే ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. జన్యుపరమైన కారణాలతోనూ కొందరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ బాధితులు ఎక్కువ. ప్రధానంగా పొగాకు సంబంధిత వస్తువుల వినియోగం వల్ల నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. క్యాన్సర్ శరీరంలో ప్రవేశించినా చాలా మందికి తెలియడం లేదు. సకాలంలో గుర్తించడం లేదు. వ్యాధిపై అవగాహన లేక వ్యాధి ముదిరి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. చికిత్స ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేక పొరుగు జిల్లాలకు వెళ్లి మరింత ప్రయాస పడుతున్నారు. ముందుగా మేల్కొని సకాలంలో చికిత్స పొందితే క్యాన్సర్ సమస్య కాదని వైద్యులు సూచిస్తున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో క్యాన్సర్ వ్యాధిగ్రస్థులు రోజురోజుకు పెరుగుతున్నారు. ప్రధానంగా పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల నోటి క్యాన్సర్ బారిన అధికంగా పడుతున్నారని వైద్యులు తెలిపారు. జిల్లాలో 130 వరకు వివిధ రకాల క్యాన్సర్ కేసులున్నాయి. వాటిల్లో రొమ్ము, నోటి క్యాన్సర్ బాధితులు ఎక్కువగా ఉన్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి తెలిపారు. కాగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వాటికి సరైన పరీక్షలు, చికిత్సలు అందుబాటులో లేక రోగులు విశాఖ వెళ్లి చికిత్స పొందుతున్నారు.

ఆహారపు అలవాట్లతోనే..

హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో తయారయ్యే ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రాసెస్ చేసిన మాంసం, ఇతర పదార్థాలు, చక్కెర ఎక్కువగా తీసుకోవడం వంటి అలవాట్లన్నీ క్యాన్సర్ కారకాలే. ప్రధానంగా ఊపిరితిత్తుల క్యాన్సర్, నోరు, గొంతు, రోస్టెడ్, రొమ్ము, గర్భాశయం, పెద్దపేగు, బ్లడ్ కేన్సర్ వల్ల మరణాలు సంభవిస్తున్నాయి. పొగాకు సంబంధిత ఖైనీ, గుట్కా, తంబాకు, ధూమపానం వినియోగం వల్ల నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నారు.



వ్యాక్సిన్‌లు ఇవే

హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల ఆడవాళ్లల్లో గర్భాశయ క్యాన్సర్‌కు కారణమౌతోంది.. అయితే 9 నుంచి 14 ఏళ్ల లోపు, హెచ్‌పీవీ వ్యాక్సిన్ 2డోసులు, 15 ఏళ్ల పైబడిన బాలికల్లో మూడు డోసులు వైద్యుల సలహామేరకు ఇస్తే, గర్భాశయ కేన్సర్‌ను 80 శాతం వరకూ నివారించవచ్చు.

- హెపటైటీస్ బి వ్యాక్సిన్ ద్వారా కాలేయం (లీవర్) ఇన్‌ఫెక్షన్‌ని నియంత్రించవచ్చు. తద్వారా లివర్ క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు.



పరీక్షలు ఇవే ..

- మమోగ్రఫీ : స్క్రీనింగ్ మమోగ్రఫీ (రొమ్ము ఎక్స్‌రే) ద్వారా 35 సంవత్సరాలు దాటిన మహిళలు ఏడాదికి ఒకసారి ఈ పరీక్షలు చేయించుకోవడం ముందుగా రొమ్ము క్యాన్సర్‌ని గుర్తించడానికి వీలు కలుగుతుంది..
- పాప్సిమియర్: 25 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళా పాప్సిమియర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా గర్భాశయ (సర్వైకల్)క్యాన్సర్‌ను ముందే గుర్తించవచ్చు.
- కొలనోస్కోపీ: 40 సంవత్సరాలు దాటిన మహిళలు, పురుషులు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ సూచనలు మేరకు కొలనోస్కోపీ పరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా పేగు (కోలన్) క్యాన్సర్‌ను ముందే గుర్తించవచ్చు.

-మిగతా 8వ పేజీలో...

కదంతొక్కారు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

బెలగాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కరించాలని విద్యార్థులు కదం తొక్కారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కాగా కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళన ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉందని పోలీసులు విద్యార్థులను అడ్డుకున్నారు. దీంతో వారు కలెక్టరేట్ గేట్ ముందు ప్రధాన రహదారిపై బైఠాయించారు. అధికారులు బయటకు వచ్చి తమ సమస్యలు వినాలని డిమాండ్ చేశారు. కొంతసేపు విద్యార్థులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువురి మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఇదే సమయంలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి, కొందరు అస్వస్థతకు గురయ్యారు. అనంతరం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ వారి వద్దకు చేరుకుని సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పండు, డేవిడ్, రాజు, అఖిల్, సింహాచలం, సింహాద్రి పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

నేటి నుంచి సార్వత్రిక క్యాన్సర్ స్క్రీనింగ్: కలెక్టర్

పార్వతీపురం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, తీవ్రమైన కేసులను పీహెచ్‌సీలకు తరలిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన వారు సుమారు 8.5 లక్షల మంది ఉండగా.. వారందరికీ స్క్రీనింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 350 మంది ఏఎన్ఎంలు, 282 మంది సీహెచ్‌వోలు, ఏడుగురు డెంటిస్టులు, 84 మంది వైద్యాధికారులు, పది మంది గైనకాలజిస్టులు పాల్గొంటారని తెలిపారు. కాగా తక్కువ నీటి సాంద్రతతో అధిక ఆదాయం, దిగుబడులు వచ్చే పంటలను సాగు చేసు కునేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇద్దరు గిరిజన విద్యార్థుల మృతి

- ఒక రోజు వ్యవధిలో వేర్వేరు చోట్ల..
- అనారోగ్యం కారణంగానే మృత్యువాత
- శోక సంద్రంలో తల్లిదండ్రులు

పార్వతీపురం/కురుపాం/జియ్యమ్మవలస, నవంబరు6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒక రోజు వ్యవధిలో ఇద్దరు గిరిజన విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారు. జ్వరంతో ఒకరు.. తలనొప్పి కారణంగా మరొకరు వేర్వేరు మండలాల్లో చనిపోవడంతో కలకలం నెలకొంది. ఆకస్మాత్తుగా పిల్లలు ఇలా చనిపోవడంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మలక్ష్మీపురం మండలం ఒండిడి గ్రామానికి చెందిన నిమ్మక జీవన్‌కుమార్(12) గత మూడేళ్లుగా జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. ప్రస్తుతం ఆ విద్యార్థి ఏడో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలోనే ఉన్న జీవన్‌కుమార్ నిన్నటివరకూ బాగానే ఉన్నాడు. ఆధార్ కార్డు తేవాలని మంగళవారం తండ్రి కృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడాడు. కాగా బుధవారం వేకువజామున తలనొప్పిగా ఉందంటూ తోటి విద్యార్థులకు చెప్పాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ వార్డెన్ డి.గణపతిరావు, ఆఫీస్ సబార్డినేట్ వెంటేష్, వంట మనిషి రాజేష్ తదితరులు పాఠశాలకు చేరుకుని జీవన్‌కుమార్‌ను సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. అయితే వైద్యాధికారులు శంకరరావు, శృతి, వైద్య సిబ్బంది పరీక్షించగా అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు షాక్‌కు గురయ్యారు. అప్పటి వరకు తమతో పాటు ఉన్న విద్యార్థి ఇలా ఆకస్మాత్తుగా చనిపోవడాన్ని వారు నమ్మలేకపోయారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు ఎస్.తిరుపతి ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన పీహెచ్‌సీకి చేరుకున్నారు. విగత జీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి భోరున విలపించారు. ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన ఒక్కగానొక్క తనయుడు ఇలా మృతి చెందడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. బాగా చదువుకుని కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న బిడ్డ మృతదేహాన్ని పట్టుకుని కన్నీరుమున్నీరయ్యారు.

కురుపాంలో...

కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న నిమ్మక నితిన్ అనారోగ్యంతో మృతి చెందాడు. దసరా సెలవుల్లో ఇంటికి వెళ్లిన ఆ విద్యార్థి తిరిగి పాఠశాలకు హాజరుకాలేదు. గుజ్జలగండకు చెందిన నితిన్ కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు గత నెల 23న కురుపాం సీహెచ్‌సీలో చేర్పించారు. అక్కడి నుంచి పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి మెరుగవకపోవడంతో బాలుడిని విజయనగరానికి రిఫర్ చేశారు. అయితే తల్లిదండ్రులు నితిన్‌ను స్వగ్రామానికి తీసుకొచ్చి నాటు వైద్యులతో చికిత్స చేయించినట్లు తెలిసింది. దీంతో ఆరోగ్యం మరింత విషమించింది. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల వార్డెన్, ఉపాధ్యాయులు గుజ్జలగండ గ్రామానికి వెళ్లి నితిన్‌ను దుడ్డిఖల్లు పీహెచ్‌సీలో చేర్పించారు. అయితే అప్పటికే విద్యార్థి పరిస్థితి బాగోలేకపోవడంతో ఈ నెల 4న అక్కడి వైద్యులు బాలుడిని పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి విద్యార్థిని విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు.


జీవన్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

టెన్షన్.. టెన్షన్!

- జిల్లా కేంద్రానికి సమీపంలో ఏనుగులు
- భామిని మండలంలో మరో గుంపు సంచారం
- భయందోళనలో ప్రజలు

పార్వతీపుర రూరల్/భామిని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రా నికి అతి సమీపంలోని వెంకంపేట గ్రామంలో ఏనుగులు సంచరిస్తున్నాయి. దీంతో స్థానికులు, అధికారుల్లో టెన్షన్ నెలకొంది. ఇప్పటివరకు నర్సిపురం సమీపంలో ఉన్న గజరాజులు బుధవారం వెంకంపేట బీసీ కాలనీవైపు నుంచి చిన్నబొండపల్లికి చేరుకున్నాయి. ప్రస్తుతం అవి వెకంపేట, చిన్నబొండపల్లి గ్రామాల మధ్య సంచరిస్తున్నాయి. డీఎఫ్‌వో ప్రసూన, రూరల్ సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో సుమారు 30 మంది పర్యవేక్షిస్తున్నారు. ఏనుగులు ఉన్న వైపు ప్రజలు వెళ్లకుండా చూస్తున్నారు. గజరాజులను దూర ప్రాంతాలకు తరలించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు.



తివ్వకొండపై...

భామిని మండలం తివ్వకొండ ప్రాంతంలో ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. బుధవారం నల్లరాయిగూడలో పంటలను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమన్నారు. పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. పాలకొండ ఫారెస్ట్ రేంజర్ కె.రమణారావు తమ సిబ్బందితో కలిసి ఆ గ్రామంలో పర్యటించి.. ఆదివాసీలను అప్రమత్తం చేశారు.

అవగాహనలేక.. సౌకర్యాల్లేక

- గిరిజన గ్రామాల్లో అధికంగా శిశుమరణాలు
- కొండశిఖర గ్రామాలకు అధ్వానంగా రోడ్లు
- వైద్య సేవలకు దూరమవుతున్న గిరిజనం
- నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినం





అవగాహన లోపం.. మూఢ నమ్మకాలు.. సరైన రహ దారులు లేకపోవడం.. వైద్య సదుపాయాలు అందకపోవడం తదితర కారణాలతో గిరిజన ప్రాంతాల్లో శిశు మరణాల సంఖ్య అధికంగా ఉంటోంది. ముఖ్యంగా మహిళల్లో అవగాహనలేమి వల్ల బిడ్డలు అనారోగ్యం పాలైనా సకాలంలో వైద్య సేవలు అందించలేకపోతున్నారు. ఫలితంగా చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. గురువారం ప్రపంచ శిశు సంరక్షణ దినం సందర్భంగా ఆ ప్రాంత పరిస్థితులను పరిశీలిస్తే...

దారపర్తి నుంచి రోగిని డోలీలో మోసుకొస్తున్న గిరిజనులు

శృంగవరపుకోట/సీతంపేట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి)

డోలీలే ఆధారం..

విజయనగరం జిల్లాలో 66 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా యి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 110 జీరో నుంచి ఒక సంవత్సరం లోపు శిశు మరణాలు (ఇన్‌ఫెక్ట్ డెత్) జరిగాయి. మృతుల్లో రోడ్ల సదుపాయం లేని గిరిజన గ్రామా లకు చెందిన వారే అధికం. దారపర్తి గిరిజన పంచాయి తీలో పది వరకు గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రా మాల్లో ఎవరికి ఆరోగ్యం బాగోలేకపోయినా డోలీతో కిందకు దిగాల్సిందే. మండల కేందంలో ఉన్న ఆసుపత్రులకు రావా లంటే ఇదొక్కటే రహదారి. దాదాపు పది కిలోమీటర్ల దూరం కొండలు, గుట్టలు దాటుకొని మూల బొడ్డవరకు వరకు నడిచి రావాలి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇలాంటి రహదారి లేని కొండ శిఖర గ్రామాలు కోకొల్లలు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల గిరిశిఖర గ్రామాలలోని 50.37 కిలోమీటర్ల రోడ్లకు కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరు 3న రూ.5,203.47 లక్షలు విడుదల చేసింది. ఈ నిధులతో 19 కొండ శిఖర గ్రామాలకు రోడ్లు వేయనున్నారు. దీన్ని బట్టి ఇప్పటికీ గిరిజన గ్రామాలకు రోడ్లు లేవని అర్థం చేసుకోవచ్చు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు వీరికి డోలీ మోతలు, మరిన్ని శిశు మరణాలు తప్పేలా లేవు.

- శృంగవరపుకోట మండలం పల్లపు దుంగాడ గ్రామానికి చెందిన ఓ మహిళకు మే నెలలో ఇద్దరు కవలలకు జన్మనిచ్చింది. రెండు నెలల తరువాత మగ బిడ్డ అనారోగ్యానికి గురయ్యాడు. ఈ గ్రామం నుంచి ఆసుపత్రికి వెళ్లాలంటే పది కిలోమీటర్ల దూరం కొండలు, గుంటలు దిగి రావాలి. దీంతో ఇంటి వద్ద వారికి తెలిసిన వైద్యం చేశారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో కిందకు దిగి స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చూపించారు. అక్కడ చికిత్స అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.
- మెంటాడ మండలం చల్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరు నెలల కాలంలో నాలుగు ఇన్‌ఫెక్ట్ డెత్‌లు (జీరో నుంచి ఒక సంవత్సరం వయస్సు గల శిశువుల మరణం) జరిగాయి. ఇందులో మూడు గిరిజన గ్రామాలకు చెందిన శిశువులు ఉన్నారు. రెండు గ్రామాలకు రోడ్డు సదుపాయం లేదు. మెంటాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాలుగు శిశు మరణాలు ఉన్నాయి. దీనిలోనూ రోడ్డు సదుపాయం లేని గ్రామం ఉంది.

సకాలంలో అందని వైద్యం..

గిరిజన ప్రాంతాలకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో వైద్యం, పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. శృంగవరపుకోట, వేపాడ, గంట్యాడ, కొత్తవలస, మెంటాడ, బొండపల్లి, గజపతినగరం తదితర మండలాల పరిధిలో గిరిజన గ్రామాలు ఉన్నాయి. శృంగవరపుకోట మండలం దారపర్తి, వేపాడ మండలం మారిక, గంట్యాడ మండలం డి.కె. పర్తి గిరిజన గ్రామా లకు రోడ్లు లేవు. ఇదేవిధంగా పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, కురుపాం, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస తదితర మండలా ల్లోనూ గిరిజన గ్రామాలు అత్యధికం. ఈ గ్రామాలకు రోడ్లు కనిపించవు. అనారోగ్యంతో బాధపడే శిశువులను సకాలంలో ఆసుపత్రులకు తరలించలేకపోతున్నారు. వైద్య సిబ్బంది అక్కడికి చేరుకోలేకపోతున్నారు. దీంతో శిశువు ప్రాణాల మీదకు వస్తోంది.

వైద్య సదుపాయాలు ఉన్నాయి..

అనారోగ్యంతో ఆసుపత్రులకు వచ్చే శిశువు లను కాపాడేందుకు మెరుగైన వైద్య సదుపా యాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్ప టికీ శిశువులకు ఆరోగ్యం బాగా లేకపోతే చేదు మందులను పడుతున్నారు. పూర్తిగా అస్వస్థతకు గురైన తరువాత ఆసుపత్రిలో చేర్పుతున్నారు. అయినప్పటికీ కాపాడుతు న్నాం. రోడ్లు లేని గిరిజన ప్రాంతాల నుంచి ఫీడర్ అంబులెన్స్‌లపై తీసుకు వస్తు న్నారు. ఇలాంటి గ్రామాల నుంచి శిశువులు ఆసుప త్రికి రావడం మరింత ఆలస్యం అవుతోంది. దీంతో ఒక్కోసారి ప్రయోజనం ఉండడం లేదు. పిల్లలు అనారోగ్యం పాలైన వెంటనే ఆస్పత్రికి తీసుకువస్తే ఫలితం ఉంటుంది.

-సత్యశ్రీనివాస్, చిన్నపిల్లల వైద్యుడు, ఎస్.కోట

కొండ శిఖర గ్రామాలకు రోడ్లు..

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కొండ శిఖర గ్రామాలకు రోడ్లేస్తుంది. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు గిరిజన గ్రామాల రోడ్లపై దృష్టి సారించారు. ఎస్.కోట మం డలం గున పాడు, మెట్ట పాలెం, సంగపాడు, చిట్టంపాడు రోడ్డుకు రూ.11.30 కోట్లు, వేపాడ మండలం గదబవలస రోడ్డుకు రూ.2.65 కోట్లు విడుదల య్యాయి. ఉమ్మడి జిల్లాలోని గిరిజన గ్రామా లకు రూ.52.03 కోట్లు కేటా యించారు. దీంతో 50.37 కిలోమీటర్ల మేర 19 గిరిశిఖర గ్రామాల కు రోడ్లు రాబోతున్నాయి. గిరిజనులకు మెరు గైన రవాణా సదుపాయం రానుండడంతో అన్ని రకాల ఇబ్బందులు తప్పుతాయి.

-కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్యే, శృంగవరపుకోట

సీతంపేట ఏజెన్సీలో ఇలా..



సీతంపేట ఏరియా ఆసుపత్రిలోని ఎన్‌ఆర్‌సి కేంద్రం

పార్వతీపురం-మన్యం, సీతంపేట ఏజెన్సీలో శిశు మరణాల రేటు కలవర పెడుతోంది. కుసిమి, దోనుబాయి, మర్రిపాడు పీహెచ్‌సీల పరధిలో శిశు మరణాల రేటు ఎక్కువగా ఉంది.

- సీతంపేట ఏరియా ఆసుపత్రి పరిధిలో 2022-24 ఏడాది వరకు 3 శిశు మరణాలు సంభవించాయి.
- కుసిమి పీహెచ్‌సీ పరిధిలో 2021-22లో అత్యధికంగా 14, 2022-24 మధ్య 6 శిశు మర ణాలు సంభవించినట్లు నివేదికలు చెబుతున్నాయి.
- -దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలో 2022-23లో 9 మంది, 2023-24 ఆగస్టు వరకు ఇద్దరు శిశువులు మృతి చెందారు.
- మర్రిపాడు పీహెచ్‌సీ పరిధిలో 2022-24 మధ్య 11 మంది చిన్నారులు మృతిచెందారు.

గడచిన నాలుగేళ్ల నివేదిక లు పరిశీలిస్తే సీతంపేట ఏజెన్సీ ప్రాంతం లో శిశు మరణాల సంఖ్య ఎక్కువగానే ఉందని చెప్పాలి. గిరిజన మహిళల్లో నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు, అవగాహన లోపం, గిరి శిఖర గ్రామాలకు సరైన రహదారి సౌకర్యాలు లేకపోవడం వంటి కారణాలు శిశు మరణాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఎన్‌ఆర్‌సీ సేవలు..

అప్పుడే పుట్టిన బిడ్డ బరువు తక్కువగా ఉండడం.. పౌష్టికాహా ర లోపం ఇతర ఆరోగ్య సమస్యలతో బాధ పడే గిరిజన చిన్నారు ల కోసం 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సీతం పేట ఏరియా ఆసుపత్రిలో పిల్లల పౌష్టికాహార పునర్జీవన కేంద్రం ఏర్పాటు చేశారు. బిడ్డలు ఆరోగ్య సమస్యలతో ఉంటే వారిని ఈ కేంద్రంలో చేర్పించి ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తారు. తల్లీపిల్లలకు పౌష్టికాహారంతో పాటు బిడ్డ పూర్తిగా కొలుకునే వరకు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతారు. గిరిజనులకు దీనిపై అవగాహన లేకపోవడంతో పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. ఇటువంటి సంరక్షణ కేంద్రాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాల్సిన ఐటీడీఏ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఇది కూడా శిశు మరణాలకు ఒక కారణంగా చెప్పవచ్చు.

మూఢ నమ్మకాలతో..

అనారోగ్య సమస్యలు వస్తే గిరిజనుల్లో అధికశాతం యజ్జరోడు, చిల్లంగి, చీటకం అంటూ కాలహరణం చేస్తారు. దీంతో పరిస్థితి చేయి దాటి పోతోంది. గర్భిణులకు జ్వరం, కడుపునొప్పి, వాంతులు వంటివి వచ్చినా తాయెత్తులు కట్టించడం, శాంతి పూజలు చేయడం, నాటు మందులు వాడడం వంటి వి చేస్తున్నారు. దీని మూలంగా గర్భంలో ఉండే బిడ్డ పుట్టిన వెంటనే అనారోగ్య సమస్యలతో మృత్యువాత పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.



ఎన్‌ఆర్‌సి కేంద్రంలో వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉన్న చిన్నారులు

పల్లెల్లో పనుల పండగ

- చురుగ్గా రోడ్లు, కాలువల నిర్మాణం
- ప్రజల్లో ఆనందం

- గత నెల 17న కూటమి ప్రభుత్వం పల్లెపండగా కార్యక్ర మాన్ని ప్రారంభించింది. గజపతినగరం మండలం పురిటిపెంట, మరుపల్లి, జిన్నాం గ్రామాల్లో కార్యక్రమాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆ గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు, గ్రావెల్ రోడ్లు, సిమెంట్ రహదారులు నిర్మిస్తున్నారు. గత ఐదేళ్ల గా వైసీపీ ప్రజాప్రతినిధులకు చెబితే అదిగో ఇదిగో అంటూ కాల యాపన చేశారు. ఇప్పుడు పల్లెపండుగ పేరుతో కూటమి ప్రభు త్వం పనులు చేస్తుండడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి.



గజపతినగరం మండలంలో పల్లెపండగ కార్యక్రమంలో పనులు ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ (ఫైల్)

విజయనగరం నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'బిల్లులు రావన్న బెంగ లేదు. రాజకీయ ఒత్తిళ్లు లేవు. నలుగురికి అవసరమైన పనులు గుర్తించారు. నిధులు సత్వరమే కేటాయించారు. పనులు అంతే వేగంగా జరిపిస్తున్నారు. వారం వారం బిల్లులు కూడా చెల్లిస్తున్నారు'.. జిల్లాలో పల్లెపండగ పేరుతో జరుపుతున్న పనుల తీరిది. జిల్లా వ్యాప్తంగా 777 పంచాయతీల్లో 'పల్లె పండుగ' పను లు చురుగ్గా జరుగుతున్నాయి. పనులు పూర్తయిన వాటికి ప్రతి గురువారం బిల్లులు చెల్లించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. దీంతో పనులు అంతే వేగంతో జరుగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధిపై దృష్టిపెట్టింది. అందులో భాగంగా ఆగస్టు 22న జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. అందులో రాజకీయాలకు అతీతంగా గ్రామపెద్దలు, ప్రజలు అందర్నీ భాగస్వామ్యం చేశారు. ప్రజో పయోగ పనులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 34 మండలాల్లో రూ.151.90 కోట్ల నిధులతో 2199 పనులకు ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. పల్లెపండగ పేరుతో నిర్వహిస్తున్న పనులు 2025 సంక్రాంతిలోగా పూర్తిచే యాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా చురుగ్గా పనులు జరుగుతున్నాయి.

గత ఐదేళ్లలో పట్టించుకోలేదు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి మచ్చుకైనా చేయలేదు. కనీసం గ్రామాలను పట్టించుకునే వారు కరువయ్యారు. సచివాలయాల భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు వంటి వాటి నిర్మాణం మాత్రమే జరిగింది. వాటికి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయి దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా మౌలిక వసతుల కల్పన విషయంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కేవలం సంక్షేమ పథకాల పేరు చెప్పి కాలయాపన చేసింది. రోడ్లు దారుణంగా తయారయ్యాయి. దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన కాలువలు ధ్వంసమ య్యాయి. పారిశుధ్యం మాయమైంది. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యా రు. పంచాయతీలు నిధులు లేక అచేతన అవస్థకు చేరుకున్నాయి. ఇటు వంటి తరుణంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మొదటిగా గ్రామాల అభివృద్ధిపై దృష్టిపెట్టింది. దీనిపై పల్లెల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

చురుగ్గా పనులు..

జిల్లా వ్యాప్తంగా పల్లెపండగలో భాగంగా అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రతి పంచాయతీలో పనులు ప్రారంభించారు. వారం వారం బిల్లుల చెల్లింపు సైతం జరుగుతోంది. సంక్రాంతి నాటికి పల్లెల రూపురేఖలు మార్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. పనులను నిరంతరం పర్య వేక్షిస్తూ నాణ్యతతో జరిపిస్తున్నాం.

-ఎ.కల్యాణ చక్రవర్తి, డ్వామా పీడీ

భారీ స్కోర్ దిశగా ఉత్తరాఖండ్

- విజయనగరంలో రంజీ క్రికెట్ మ్యాచ్

విజయనగరం టౌన్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో బుధవా రం నుంచి ప్రారంభమైన రంజీ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టు భారీ స్కోర్ దిశగా దూసుకుపోతుంది. బీసీసీఐ ఆధ్వర్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆతిథ్యం ఇస్తున్న నాలుగు రోజుల మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచిన ఉత్తరాఖండ్ కెప్టెన్ సమ ర్థ్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఓపెనర్లు అవినీష్ సుధ, పీఎస్ ఖండూరీల తొలి వికెట్ నష్టపోయే సమయానికి 157 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. అవినీస్ సుధా 158 బంతుల్లో 12 ఫోర్లతో 86 పరుగులు సాధించి లలిత్ మోహన్ బౌలింగ్‌లో ఆంధ్రా కెప్టెన్ రషీ ద్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. అనంతరం ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ సమర్థ్ 30 పరుగులు (నాటౌట్), ఖండూరీ 107 పరు గులు (నాటౌట్) సాధించారు. అంతేకాకుండా ఆట ముగిసే సమయానికి ఇరువురు అజే యంగా 75 భాగస్వామ్యం నెలకొల్పి క్రీజ్‌లో ఉన్నారు. పర్యాటక జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 232 పరుగులు సాధించింది. ఆంధ్రా బౌలర్లు ఎంత ప్రయత్నించినా మరో వికెట్ సాధించలేకపోయారు.









బతుకు పోరు

కూటి కోసం కోటి పనులున్నప్పటికీ సాహసం చేయందే కొందరికి కాలం గడవదు. నదిలోకి ఎడ్లబళ్లతో పీకల్లోతు వరకు వెళ్లి ఇసుకను సేకరిస్తున్న ఆ కూలీలు కష్టం చూస్తుంటే ఎవరికైనా అమ్మో అనిపిస్తుంది. డెంకాడ మండలం ముంగినాపల్లి వద్ద ఈ దృశ్యం బుధవారం కనిపించింది. అంతలోతు వరకూ వెళ్లందే ఇసుక దొరకడం లేదని వారు చెబుతున్నారు. అక్కడికి సమీపంలో ఓ మత్స్యకారుడు చేపలు పడుతున్నాడు. నదిలో దిగి వల వేసి చేపలు పట్టడం సులువు కాదని, ఒక్కోసారి లోతుకు వెళ్లాల్సి ఉంటుందని, అయినా చేపలు దొరకవని తెలిపాడు.

-విజయనగరం



108 శివలింగాలకు నిత్య రుద్రాభిషేకాలు

కొత్తవలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా తుమ్మికాపల్లి రైల్వేగేట్ సమీ పంలోనున్న ఓం సదనంలో 108 శివ లింగాలకు ప్ర తి రోజు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహిస్తు న్నారు. సదనం వ్యవస్థాపకుడు అంపోలు ఉమామ హేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేమకోటి జగన్నాథ శర్మ, సదనం అర్చకుడు కిరణ్ కుమార్ శర్మలు ఈ అభిషేకాలు చేస్తున్నారు. కార్తీక సోమవారాలు, కా ర్తీక పౌర్ణమి, ఏకాదశి పర్వదినాలలో ఉదయం నుం చి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఉమామహేశ్వర శర్మ తెలిపారు.

శివలింగాలకు రుద్రాభిషేకం చేసినదృశ్యం

చెరువుల పరిశుభ్రత ముఖ్యం: కమిషనర్



ఖాళీ స్థలాల విషయమై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి): చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. బుధవారం ఫూల్‌బాగ్‌లోని ప్రేమసమాజం ఎదురుగా ఉన్న బ్రాహ్మణ చెరువు చెత్తాచెదారంతో నిండి ఉండడాన్ని చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చెరువును శుభ్రం చేయాలని ప్రజలను, సిబ్బందిని ఆదేశించారు. దీంతో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ నేతృత్వంలో సిబ్బంది ఎస్కవేటర్‌తో చెరువులో వున్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య పిలుపునిచ్చారు. బుధవారం లక్ష్మీగణపతి ఆలయ ప్రాంతంలో పర్యటించారు. డివిజన్ పరిధిలో ఖాళీ స్థలాలకు పన్నులు ఎందుకు వసూలు చేయడం లేదని అడ్మిన్, కార్యదర్శులపై అగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణల తొలగింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా ఉన్న కారు షెడ్‌లను వెంటనే తొలగించాలన్నారు. కొన్ని చోట్ల రోడ్లు, కాలువలు లేకపోవడం చూసి వెంటనే ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రోడ్లపై ఎక్కడా భవన వ్యర్థాలు ఉండరాదన్నారు. గుడిసెల్లో ఉన్న వారికి ఇళ్ల మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. టిఫిన్ దుకాణం వద్దకు వెళ్లి పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయక కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, టీపీఆర్‌ఓ సింహాచలం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించండి



నిరసనలో పాల్గొన్న విద్యార్థి కుటుంబ సభ్యులు, విద్యార్థులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసీ వసతి గృహంలో అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ డిమాండ్ చేశారు. అలాగే నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి మరణం వెనుక ఉన్న అన్ని కోణాలను ప్రభుత్వం వెలికి తీయాలన్నారు. ఘటనకు వారం రోజుల ముందు నుంచి విద్యార్థికి, వార్డెన్‌కు మధ్య ఘర్షణ జరుగుతోందని తోటి విద్యార్థులు తెలిపారన్నారు. వసతి గృహం సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకు వెళ్లకుండా... ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి కుటుంబ సభ్యులతో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, శిరీష, సోమేష్, సుస్మితతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన కలిశెట్టి



మంత్రి లోకేశ్‌తో ఎంపీ కలిశెట్టి

రాజాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ అంశాలపై చర్చించినట్లు కలిశెట్టి తెలిపారు. అండమాన్‌తో పాటు, ఎచ్చెర్ల నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదుపై చర్చించినట్టు వివరించారు. ఈ చర్చలో అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ సమన్వయకర్త మాధవనాయుడు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గచ్చలవలస గ్రామానికి చెందిన సిమ్మాల ఎరకయ్యకు రూ.రెండు లక్షల చెక్కును ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు బుధవారం అందజేశారు. రాజాంలోని ఆయన నివాసంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ చెక్కును అందజేశారు. టీడీపీ కార్యకర్త ఎరకయ్య లివర్ వ్యాధితో బాధ పడుతున్నారు. మెరుగైన వైద్య కోసం ప్రభుత్వం ఆయనకు రూ.రెండు లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు బాధితునికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం, సిమ్మాల దుర్గాప్రసాద్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

'ఆశయ' రమణ సేవలు చిరస్మరణీయం



రక్తదానం చేస్తున్న యువకులు

చీపురుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆశయ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత రెడ్డి రమణ సేవలు చిరస్మరణీయమైనవని వక్తలు కొనియాడారు. జి.అగ్రహారంలో బుధవారం రమణ మృతికి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక సేవా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎస్.ఎస్.రాజు, చైతన్య, అబ్దుల్ రవూఫ్, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు నారు సింహాద్రినాయుడు, వావిలపల్లి మోహనరావు, మానవీయత సంస్థ అధ్యక్షుడు టీవీ గోవిందరాజులు, సమత కన్వీనర్ ఎం.సుశీల, గొర్లె పద్మావతి తదితరులు రమణ సేవలను కొనియాడారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం కృషి చేసే వారికి రమణ పేరు మీద ఏటా అవార్డును అందజేయనున్నట్టు ఎస్.ఎస్.రాజు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు, మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ, ఉపాధ్యాయులు మీసాల లక్ష్మణరావు, డోల నాగరాజు, గిడిజాల లక్ష్మునాయుడు, గంగుబిల్లి సత్యనారాయణ, రమణ మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోండి

రాజాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించడాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రాజాంలో బుధవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వాసు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, ఎస్.కిశోర్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రమేష్‌చంద్ర, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠ

బొబ్బిలి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పారాది గ్రామంలో బుధవారం అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాగిరడ అప్పలస్వామి దంపతులు, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

వెసులుబాటుతో మేలు

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛనుదా రులు ఒక నెల పింఛను తీసుకోకపోతే.. ఆ తరువాత రెండు నెలలకు కలిపి తీసుకునే వెసులుబాటు కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్టు బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భోగాపురపు వాయునందన శర్మ చెప్పారు. మూడో నెలల పింఛను ఒకేసారి తీసుకునే వెసులుబాటును ముఖ్యమంత్రి చంద్రబాబు కల్పించడం అభినందనీయమన్నారు.

చంద్రశేఖర్‌కు అవార్డు

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి): మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలో రసాయన శాస్త్రంలో సహాయ ఆచార్యులు, జిల్లా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి గురుబిల్లి చంద్రశేఖరరావు గురుబ్రహ్మ అవార్డుకు ఎంపికయ్యారు. విశాఖపట్టణానికి చెందిన మదర్‌థెరిస్సా సేవా సంఘం ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం డీపీఓ ఈపీఎస్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నిత్యావసరాల పంపిణీ

జామి, నవంబరు 6: విజిగిగిరి గ్రామంలో బుధవారం స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యవసరాలు అందించారు. ప్రతినెల వీరు 20 కుటుంబాలకు నిత్యవసరాలు, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, వైద్య ఖర్చులు వంటి వాటికి సాయం చేస్తున్నారు.

పారిశుధ్యంపై దృష్టి

విజయనగరం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని అధికారులు సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ, మండల, జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీపై జెడ్పీలో నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో బి.వి.సత్యనారాయణ, డీపీవో టి.వెంకటేశ్వర రావులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ప్రణాళికల్లో పారిశుధ్యం, తాగునీరు, మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం ముఖ్య అంశాలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఈవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదు

బొబ్బిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బారినపడిన వారి పట్ల వివక్ష చూపితే చట్టరీత్యా నేరమవుతుందని వైడీఓ ప్రాజెక్టు మేనేజరు ఎల్‌శ్రీకాంత్‌బాబు అన్నారు. స్థానిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బాధితులు, వివక్షకు గురవుతున్న వారు ఎవరైనా ఉంటే 1097 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేస్తే పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.26 కోట్లతో పనులు

రామభద్రపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఈ ఏడాది రూ.26 కోట్లు మంజూరైనట్టు పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈసారి పనులు జరిగిన వెంటనే క్వాలిటీ కంట్రోల్ (సీసీ) తనిఖీ చేసిన తరువాతే బిల్లులు చెల్లిస్తారని తెలిపారు. త్వరలోనే పనులు చేపటడానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు.

మార్చిలోగా పూర్తి

బొబ్బిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న మొత్తం 47 పనులన్నిటినీ రూ.2.36 కోట్లతో చేపట్టనున్నట్టు డీఈఈ కిరణ్‌కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. మార్చిలోగా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలలో పాలక వర్గ సభ్యులు చేసిన ప్రతిపాదనల మేరకు దశల వారీగా పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

హమాలీ చార్జీలు అందజేత

బొబ్బిలి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీహెచ్ బొడ్డవలస, గోపాలరాయుడుపేట, కాశిందొరవలస రైతులకు 2021 -2022 సంవత్సరానికి హమాలీ చార్జీల కింద బుధవారం రూ.7,34,640 పంపిణీ చేశారు. ఇంకా 65 మంది రైతులు మాత్రమే మిగిలి ఉన్నారని ఎఫ్‌పీఓ డైరెక్టర్ కె.సింహాచలం తెలిపారు.

విభిన్న రూపాల్లో భారం

కొత్తవలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోను, కేంద్రంలోను అధికారంలో ఎవరు ఉన్నా.. ప్రజలకు వివిధ రకాల భారం తప్పడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.అప్పారావు అన్నారు. సీపీఎం 10వ జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం కొత్తవలసలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు మద్దిల రమణ, పాల రైతుల సంఘ జిల్లా కార్యదర్శి జి.కృష్ణమూర్తి, ముఠా కార్మిక సంఘం నాయకులు సూరెడ్డి శ్రీను, జక్కాన వెంకటరమణ, దావాల మహేష్, జక్కాన చిన్న, జామి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరుగు పోటీల్లో ప్రతిభ

వంగర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వంగర జెడ్పీ పాఠశాల విద్యార్థి కొమరాపు చందు రాష్ట్రస్థాయి పరుగు పందెంలో మంచి ప్రతిభ కనబరిచాడు. శ్రీకాకుళంలో జరిగిన 100 మీటర్ల పందెంలో ద్వితీయ స్థానం సాధించాడు. ఆ విద్యార్థిని హెచ్ఎం రమణమ్మ తదితరులు అభినందించారు.

పస్తులు ఉంటున్నాం.. ఆదుకోండి

వేపాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సేవలు అందిస్తున్న తమకు గత మూడు నెలలుగా వేతనాలు అందక పోవడంతో కుటుంబాలతో పస్తులు ఉండాల్సి వస్తోందని 104 వాహన సిబ్బంది వాపోతున్నారు. ఈమేరకు 104 వాహనాల్లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎల్.రమాదేవికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ నర్సింగరావు, డీఈఓ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుతో పర్యావరణానికి నష్టం

శృంగవరపుకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కట్టెలు, బొగ్గుల వాడకంతో పర్యావణానికి నష్టం జరుగుతుందని పర్యావరణ వేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని నిరోధించే దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రకటన విడుదల చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, వసతి గృహాల్లో కట్టెల పొయ్యి, బొగ్గులతో వంటలు చేస్తున్నారన్నారు. దీనికోసం చెట్లు తొలగిస్తుండడంతో పాటు వాటిని కాల్చడంతో మరింత వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు.

శిక్షణ పేరిట శిక్షలు వద్దు

బొబ్బిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు నిర్బంధ శిక్షణ పేరుతో శిక్ష వేయడం సరికాదని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ డైరెక్టర్ జేసీ రాజు కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏలూరు జిల్లా అగిరిపల్లిలో ఉపాధ్యాయ శిక్షణా శిబిరంలో రత్నకుమార్ అనే హెచ్ఎం అశువులు బాయడం దురదృష్టకరమని అన్నారు. దీనికి విద్యాశాఖ బాధ్యత వహించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

తల్లి కళ్లెదుటే బిడ్డ దుర్మరణం



సూరిబాబు(ఫైల్)

భోగాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లి ఎదుటే బిడ్డ దుర్మరణం పాలైన సంఘటన స్థానికులను కలచివేసింది. సవరవల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడుకు కర్రి సూరిబాబు(40) మృతి చెందగా.. తల్లి కర్రి ఆదిలక్ష్మి ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే... విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంకి గ్రామానికి చెందిన తల్లీ కొడుకులు కర్రి ఆదిలక్ష్మి, కర్రి సూరిబాబు ద్విచక్ర వాహనంపై ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఈకేవైసీ చేసుకొనేందుకు భోగాపురం హెచ్‌పీ గ్యాస్ గోదాంకు వచ్చారు. అక్కడ ఈకేవైసీ పనులు ముగించుకొని విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లే సర్వీస్ రహదారిలో తగరపువలస వైపు వెళ్తున్నారు. సవరవల్లి సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. సూరిబాబు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కర్రి ఆదిలక్ష్మి తీవ్ర గాయాల పాలైంది. ఆమె ప్రస్తుతం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సూరిబాబు లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి తల్లితో పాటు భార్య సంతోషి, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



మన్మథరావు (ఫైల్)

చీపురుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో బుధవారం రైలు కింద పడి కుప్పిలి మన్మథరావు (65) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. స్థానికులు, జీఆర్పీ సిబ్బంది సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి... చిననడిపల్లి గ్రామానికి చెందిన మన్మథరావు గతంలో నాన్ మెడికల్ సహాయకులుగా పని చేసి రిటైరయ్యారు. ఆయన భార్య పొందూరు మండలంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. మన్మథరావు కూడా గత కొంతకాలంగా అక్కడే నివాసం ఉంటున్నట్టు సమాచారం. బుధవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతూ శ్రీకాకుళం వైపు నుంచి వస్తున్న సూపర్ ఫాస్ట్ రైలు ఢీకొని మరణించారు. జీఆర్‌పీ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొండగుడి ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరం వన్‌టౌన్ కొండగుడి కన్నెమరియ ఘాట్ రోడ్డులో ప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో కన్నెమరియమ్మను దర్శించుకొని ఆటోలో తిరిగి వస్తుండగా [illegible] పనిచేయకపోవడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 12 మందిలో 11 మంది స్వల్పగాయాలతో బయటపడగా, మరొకరి తలకు తీవ్రగాయమైంది. క్షతగాత్రులందరినీ హార్బర్ పోలీసులు కేజీహెచ్‌లో చేర్పించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద క్యాజువాల్టీలో మధ్యాహ్నం సకాలంలో వైద్య చికిత్సలు అందేలా చర్యలు చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించి హార్బర్ పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ. మోహనరావు అందించిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా ఎల్ కోట మండలం రంగరాయపురానికి చెందిన ఎల్.గౌతంరాజు (35) ఆటో డ్రైవర్. అతని కుటుంబీకులు 11 మందితో కలసి విశాఖపట్నంలోని కొండగుడి కన్నెమరియమ్మను దర్శించుకునేందుకు బుధవారం వచ్చారు. ఉదయం 11 గంటల సమయంలో కొండగుడి దర్శనం ముగించుకుని తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా కిందకు ఆటోలో 11 మందితో వస్తుండగా ఆటో బ్రేకులు పనిచేయలేదు. దీంతో ఆటోను డివైడర్‌కు ఢీకొట్టించి ఆపే ప్రయత్నం చేశాడు. దీంతో ఒక్కసారిగా ఆటోలో ప్రయాణిస్తున్న 11 మంది చెల్లాచెదురుగా పడిపోయారు. విషయం తెలుసుకున్న వెంటనే హార్బర్ పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలియజేశారు. వీరిలో పరదేశి అనే వ్యక్తి తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. మిగతా 11 మందికి స్వల్ప గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆటోలో ప్రయాణిస్తున్నవారిలో ఇద్దరు మహిళలు, బాలిక, బాలుడు, 35 ఏళ్లలోపు ఏడుగురు మగవారు ఉన్నట్లు చెప్పారు. ఘాట్ రోడ్డు ఘటనలో గాయపడి కేజీహెచ్ క్యాజువాల్టీలో చికిత్స నిమిత్తం చేరిన క్షతగాత్రులకు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద దగ్గరుండి వైద్య చికిత్సలు చేయించారు. క్యాజువాల్టీ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సర్జరీ వైద్యులతో ఆయన మాట్లాడుతూ క్షతగాత్రులకు సత్వరమే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టారు. తలకు గాయమైన పరదేశికి అన్నిరకాల వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

విజయనగరం క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హుడా కాలనీలో పక్షవాతంతో బాధ పడుతున్న మహిళ మెడలోంచి నాలుగు తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి తెంపుకుని పరారయ్యాడు. సి.ఐ. శ్రీనివాస్ కథనం మేరకు... ఫైలా నాగేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు హుడా కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 5న రామలక్ష్మి ఇంట్లో ఒక్కరే ఉన్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో ఉన్న ఆభరణాలను తెంచుకొని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ. శ్రీనివాస్ తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

సంతకవిటి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని సంతకవిటి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ గోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యాన్ని తరలించరాదని సూచించారు.

బైక్‌లు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

రేగిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిన్నశిర్లాం సమీపంలో బుధవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రేగిడి మండలం లచ్చరాయపురానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ నేతల అప్పలనాయుడు, చీపురుపల్లికి చెందిన చిన్ని మహేష్‌లకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఎస్ఐ నీలావతి, స్థానికుల కథనం ప్రకారం. రాజాం నుంచి పాలకొండ వైపు వస్తున్న హెచ్‌సీ అప్పలనాయుడు.. ఎదురుగా వస్తున్న చీపురుపల్లికి చెందిన మహేష్ బైక్‌లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. గాయపడిన వారిని చికిత్స కోసం స్థానిక కేర్ ఆసుపత్రికి తరలించారు. మహేష్ ఇంకా అపస్మారక స్థితిలో ఉన్నట్లు.. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తే చర్యలు

గంజాయి, ఇతర మత్తుపదార్థాలు తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ నీలావతి వాహనదారులను హెచ్చరించారు. బుధవారం రాత్రి బూరాడ సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల కలిగే సమస్యలపై వాహనదారులకు ఎస్ఐ అవగాహన కల్పించారు. ఈ తనిఖీలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

లక్కవరపుకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర్‌నాయుడు తమ సిబ్బందితో కలిసి వేపాడ, ఎల్.కోట మండలాల్లో దాడులు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపాడ మండలంలో 2 పురుగు మందుల షాపుల్లో సీసాలపై తయారీ తేదీలను తొలగించి... కొత్త తేదీలు వేసినట్టు గుర్తించామన్నారు. రెండు ఆయిల్ షాపుల్లో తక్కువ బరువు ఉన్నట్టు గుర్తించామన్నారు. వేపాడలో 2 బేకరీలలో తయారీ, బరువుల లేబుళ్లు లేవని గుర్తించామన్నారు. రెండు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్లు బరువు తక్కువగా ఉందని గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. ఎల్.కోట మండలంలో మూడు కిరాణా షాపుల్లో తూనికల కాటాలకు సీళ్లు లేవని తెలిపారు. రేషన్ డిపోలో 10 కిలోల బియ్యం బరువుకు తొమ్మిదిన్నర కిలోలు మాత్రమే ఉన్నట్టు గుర్తించామన్నారు. కళ్లేపల్లిలోని బేకరీలో తయారీ తేదీ, నికర బరువు లేనట్టు గుర్తించామన్నారు. ఈ దాడుల్లో టెక్నికల్ అసిస్టెంట్ బి.సత్యనారాయణ, సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

హోటళ్లపై విజిలెన్స్ దాడులు

రాజాం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ హోటళ్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది బుధవారం దాడులు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న 9 గృహ వినియోగ సిలిండర్లను (డొమెస్టిక్) స్వాధీనం చేసుకున్నారు. వాటిని సివిల్ సప్లయిస్ డీటీ చిరంజీవిరావుకు అప్పగించారు. ఈ దాడుల్లో సిబ్బంది లక్ష్మీనారాయణ, పురుషోత్తం, వీఆర్వోలు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు స్థల పరిశీలన

రాజాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు చీపురుపల్లి ఆర్డీవో బీవీ సత్యవాణి బుధవారం స్థల పరిశీలన చేశారు. మల్లికార్జున కాలనీ సమీపంలోని సంతమార్కెట్ ఆవరణలో సర్వేనెంబరు 190/ 1, 2 లో స్థలాన్ని పరిశీలించారు. స్థలం యజమానితో మాట్లాడి వివరాలు తెలియజేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆర్డీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కృష్ణరాజు, కమిషనర్ జె.రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆశలపై నీళ్లు!

(ఐదో పేజీ తరువాయి)

క్లైవసం చేసుకుంది. అక్కడ మాజీ మంత్రి బొత్సను రంగంలోకి దించగా టీడీపీ అభ్యర్థిని నిలపలేదు. ఇప్పుడు విజయనగరంలో కూడా అదే ఫార్ములాను అనుసరించాలని వైసీపీ భావించింది. సీనియర్ నాయకుడు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పేరును ఖరారు చేసింది. అమరావతిలో విజయనగరం ఉమ్మడి జిల్లాల నేతలతో జగన్ సమావేశం అయ్యారు. తొలుత మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి వైపు జగన్ మొగ్గుచూపారు. చివరకు వెలమ సామాజికవర్గానికి చెందిన శంబంగిని ఖరారు చేశారు. అయితే కూటమి నుంచి పోటీ పెడతామని మాటే వినిపించింది కానీ అభ్యర్థి విషయంలో ఎటువంటి ప్రకటన రాలేదు. సరిగ్గా ఇదే సమయంలో హైకోర్టు తీర్పు వచ్చింది. దీంతో ఇందుకూరి రఘురాజు యథతథంగా ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. ఒక విధంగా ఇది వైసీపీకి షాకింగ్ పరిణామమే. ఆ పార్టీ ఆశలపై న్యాయస్థానం నీళ్ల చల్లినట్టు అయ్యింది.

న్యాయం గెలిచింది



స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా శాసన మండలి విధించిన అనర్హతను హైకోర్టు రద్దు చేసింది. పార్టీలోనే ఉన్నప్పటికీ వైసీపీ నాపై అన్యాయంగా శాసన మండలికి ఫిర్యాదు చేసింది. అనర్హత వేటు వేయడంతో హైకోర్టును ఆశ్రయించాను. నావైపు న్యాయం ఉందని కోర్టు నమ్మింది. నాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. 2027 డిసెంబర్ వరకు పదవిలో వుండేలా చర్యలు తీసుకుంది.అనర్హత ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకు వున్న కాలాన్ని కూడా అర్హతగా నిర్ణయించింది. చాలా ఆనందంగా వుంది. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దయకలిగింది. నాకు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు.

- బుధవారం హైకోర్టు తీర్పు అనంతరం ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో స్పందించిన ఇందుకూరి రఘురాజు

ముందుచూపుతోనే కట్టడి

(ఐదో పేజీ తరువాయి)

హెచ్చరికలు ఇవే ...

● శరీరంలో ఎక్కడైనా పుండు ఏర్పడి అది తగ్గకపోవడం, పుట్టుమచ్చలు రంగు మారడం, పరిమాణంలో మార్పు చెందడం ● మాలమూత్ర సమయాల్లో మార్పులు ● తినే ఆహారం మింగడం కష్టంగా అన్పించడం, అరుగుదల సరిగా లేకపోవడం ● మహిళల్లో అసాధారణ రక్తస్రావం.. ● శరీరంలో ఏ భాగంలోనైనా వాపు కాని, గడ్డలు కాని ముఖ్యంగా మహిళల రొమ్ముల్లో గడ్డలు వుండడం ● అలసటగా అన్పించడం, బరువు తగ్గడం ● గొంతు బొంగురుపోవడం, రక్తహీనత, ఎడతెగని దగ్గు, జ్వరం లక్షణాలు వుంటే కేన్సర్ కావచ్చు. వాటిని అశ్రద్ధ చేయకుండా డాక్టరు వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుని నిర్ధారణ చేసి తగిన చికిత్స చేసుకోవాలి,

జాగ్రత్తలు తప్పనిసరి

క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. మద్యం, పొగాకుకు దూరంగా ఉండాలి. సమతుల్య ఆహారం తీసుకోవాలి. రోజూ వ్యాయామం చేయాలి. కేన్సర్ బారిన పడకుండా వ్యాక్సినేషన్ వేయించుకోవాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా కేన్సర్ ఉంటే ముందుగానే పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. ఆపై శరీరంలో మార్పులు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి.

టి.జగన్మోహన్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి

రేపు అసంఘటిత కార్మికులకు స్పెషల్ డ్రైవ్

పార్వతీపురం/గరుగుబిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గురుగుబిల్లి మండలంలోని గొట్టివలసలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి అసంఘటిత కార్మికుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక న్యాయ అవగాహనా కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసంఘటిత కార్మికులు, గిరిజనుల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి, నాగూరులోని సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనుల వల్ల శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గొట్టివలస, మరుపెంట, ఉద్దవోలు, చినగుడబ, రావివలస, లఖనాపురం, చిలకాం, కారివలస, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల నిర్వహణ పనులతోపాటు ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

పాలకొండలో టీడీపీ సభ్యత్వ నమోదు

పాలకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఘటాలడెప్పివీధిలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆ పార్టీ నాయకుడు గుమ్మడి సింహాద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శాసపు సర్వారావు, గోవింద్, శాసపు చిన్నయ్య, బుగత పైడి రాజు, సతివాడ కృష్ణ వేణి, పార్వతి పాల్గొన్నారు.

కురుపాంలో సీపీఎం జిల్లా మహాసభలు

సీతానగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో జిల్లా మహాసభలు డిసెంబరు 10, 11 తేదీల్లో జరుగుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. బుధవారం మండలంలోని చినభోగిలిలో సీపీఎం మండల మహాసభ పురస్కరించుకుని నాలుగురోడ్ల కూడలిలో పార్టీ జెండాను నాయకుడు బి.అప్పారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.మన్మథరావు, సీపీఎం మండల కమిటీ సభ్యులు జి.వెంక టరమణ, కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మీనాయుడు, మండల కమిటీ సభ్యులు రెడ్డి రమణమూర్తి, ఆర్.రాము. వి.రామలక్ష్మి, బి.అప్పా రావు, సీహెచ్ కృష్ణ, బి.రామస్వామి, వై.రామారావు పాల్గొన్నారు.



గోతుల్లో దిగితేనే గొంతు తడిచేది

● వర్షాకాలంలోనూ తప్పని అగచాట్లు
● ఇదీ పార్వతీపురంలో పరిస్థితి

పార్వతీపురం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో గొంతు తడుపుకోవానికి కొళాయి గోతుల్లో దిగాల్సివస్తోంది. ఇక్కడ వర్షాకాలంలోనూ తాగునీటి అవస్థలు తప్పడం లేదని పట్టణ వాసులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం పుణ్యమాని కొళాయిల ద్వారా నాలుగు నుంచి ఐదురోజులకో సారి సరఫరా చేసే నీటికోసం సైతం రెండు నుంచి మూడడుగుల గుంతల్లోకి దిగాల్సిన దుస్థితి ఏర్పడింది. మునిసిపాలిటీలో 30 వార్డులు ఉండగా సగానికిపైగా వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా తాగునీటి సర ఫరాలో సాంకేతిక సమస్య అధిగమించకపోవడంతోపాటు ఇంజనీరింగ్ అధికారులు సరిగ్గా ప్రణాళికలు సిద్ధం చేయకపోవడం వల్ల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. మునిసిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులోగల కోవెలవీధిలో ఈ సమస్య ఎక్కువగా వేధిస్తోంది. కుసుమగుడ్డి, బొగ్గుల, తదితర వీధుల్లో మహిళలు, వృద్ధులు గుంతల్లో ఉన్న కొళాయిల ద్వారా తాగునీటిని పట్టుకోవడానికి అగ చాట్లకు గురవుతున్నారు. ప్రధానంగా తాగునీటికోసం కొళాయి గోతుల్లో దిగాల్సిన సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా చర్యలు తీసుకోవడంలేదని ఆయా వార్డుల్లో మహిళలు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లోకి వరద, మురుగునీరు చేరడంతో బిందెడు నీటి పట్టుకోవడానికి సైతం అవస్థలు పడుతున్నామని పలువురు చెబుతున్నారు. కాగా త్వరలో మునిసిపాలిటీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఇంజనీరింగ్ విభాగం ఏఈ అప్పారావు తెలిపారు.



గోతిలో ఉన్న కొళాయి నుంచి నీటిని పడుతున్న వృద్ధురాలు

పాదయాత్ర తాత్కాలికంగా నిలిపివేత



పాదయాత్రను అడ్డుకుంటున్న పోలీసులు

బెలగాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బడిదేవర కొండపై మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని పరిరక్షణ కమిటీ చేపట్టిన పాదయాత్రకు అనుమతులు లేవని పోలీసులు తెలియజేయడంతో తాత్కాలికంగా నిలిపివేసినట్లు పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం బడిదేవర కొండపై మైనింగ్ అనుమతులు రద్దుచేయాలని పార్వతీపురం ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాదయాత్ర చేపట్టారు. ఎన్నికల కోడ్ ఉండడంతో అనుమతులులేవని, తర్వాత అనుమతి ఇస్తామని పోలీసులు సూచించడంతో వెంకంపేటగోలీల వద్ద చేరుకున్న పాదయాత్ర అక్కడ నిలిపివేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, కె.మన్మథరావు, రంజిత్‌కుమార్, భాష, నర్సింగరావు, సంగం, దాసు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన సిబ్బందికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ తదితరులు

పార్వతీపురం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లిన ఉద్యోగులు విధి నిర్వహణలో పట్టణ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది మన్ననలు పొందారని మునిసిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేష్ తెలిపారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇటీవల బదిలీపై వెళ్లిన కమిషనర్‌తో పాటు పలువురు ఉద్యోగులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు కమిషనర్ కె.శ్రీనివాస్‌తోపాటు డీఈ కిరణ్‌కుమార్, ఏఈ ఆనంద్, సీనియర్ అసిస్టెంట్లు కిషోర్‌కుమార్, చక్రవర్తి, ఆర్ఐ పి.నారాయణరావు, జూనియర్ అసిస్టెంట్లు విజయగౌరి, సింహాచలం, క్యాషియర్ శంకరరావు, అటెండర్ సరోజిని, పలువురు సచివాలయ సెక్రటరీలకు ఎఫ్ఏసీ కమిషనర్ శ్రీనివాసరాజు, ఆర్వో రూబెన్ దిబ్బా, జేఏవో అశోక్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సత్కరించారు.

దీర్ఘకాలిక రోగులకు సేవలందించండి

● వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు

గరుగుబిల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు సూచించారు. బుధ వారం మండలంలోని ఉల్లిభద్రం లో హెల్త్ అండ్ వెల్‌నెస్, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉన్నత పాఠ శాలను పరిశీలించారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ ఎప్పటిక ప్పుడు ఆరోగ్య సర్వేలు చేపడుతూ అనారోగ్య లక్షణాలుఉన్న వారిని గుర్తించి వైద్యం అందజేయాలన్నారు. అనంతరం అం గన్‌వాడీకేంద్రంలో పిల్లల బరువు, ఎదుగుదలకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. అలాగే ఉన్నత పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బందితో మా ట్లాడారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా గుర్తించిన విద్యార్థులతో డాక్టర్ జగన్మోహన్ రావు మాట్లాడి వారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. సికిల్‌సెల్ ఎనీమియాతో ఉన్న ఇద్దరు విద్యార్థులకు ఆరోగ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.శ్రీనివాస్, కార్యాలయ ఈవో సత్తిబాబు, వైద్య సిబ్బంది అనిత, మాలతి, అంగన్‌వాడీ సిబ్బంది లావణ్య కల్పన పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

బెలగాం, నవంబ రు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని, వెంటనే బకాయి వేతనాలు చెల్లిం చాలని 104 ఉద్యోగు లు కోరారు. ఈమేరకు బుధవారం డీఎంహెచ్‌వో విజయ పార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ మూడు నెలలుగా తమకు వేతనం ఇవ్వకపో వడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, ఆనందరావు, ప్రసాదరావు, జగదీశ్, సంతోష్, తేజ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి: డీఈవో

గరుగుబిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో నల్ల తిరుపతినాయుడు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత , ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 10వ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని, సమయపాలనతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవనిహెచ్చరించారు. విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా పోషకాలతో కూడిన భోజనం అందించాలన్నారు. వారి ఆరోగ్య పరిస్థితులను గమనించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల విధులపై ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. పాఠశాలల్లోని ఖాళీ స్థలాల్లో బడి తోటలు పెంపకం చేపట్టాలని తెలిపారు. ఈ పరిశీలనలో ఎంఈవోలు దత్తి అప్పలనాయుడు, కె.కొండలరావు, హెచ్ఎం పాత్రుడు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

వీరఘట్టం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో బి.వెంకటరమణ కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సత్యంనాయుడు, ఈసీ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతంపేటరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గొయిది, మండకాలనీ గ్రామాల్లో బుధవారం రైతులకు సిబ్బంది ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టేట్ రీజినల్ అధికారి ఆర్వో ప్రకాశరావు, ఆర్టీవో హేమసుందర్ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న పంటలు, పంట పొలాల గట్లపైన వేసిన బహుళ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ ముసలయ్య, డివిజన్ ఇన్‌చార్జి బాలు, నరేష్, సత్యనారాయణ, మెంటర్ భాస్కరరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై ...

వీరఘట్టం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండువ జడ్పీ ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.కార్యక్రమంలో హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు దేవలింగం, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధంపై ...

సీతంపేట రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిరోధించడం, రహదారి ప్రమాదాల నివారణపై ఎస్ఐ అమ్మన్నరావు వాహనచోదకులకు అవగాహన కల్పించారు. బుధవారం కుడ్డపల్లి జంక్షన్‌లో వాహన చోదకులకు రహదారి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలు, సైబర్ నేరాలపై వవరించారు.

పారిశుధ్య పనులపై శ్రద్ధ వహించండి

సాలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మునిసిపల్ కమిషనర్ సత్యనారాయణ కోరారు. బుధవారం సాలూరులో మునిసిపల్ పారిశుధ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని 29 వార్డుల్లో 43 మైక్రో పాకెట్లల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి వార్డులోఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టాలన్నారు.ప్రతి ఒక్క ప్యాకెట్ నుంచి రెండు డబ్బాలు తడి చెత్తను సేకరించాలని, రోడ్లపై, కాలువల్లో విచ్చలవిడిగా చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి షాపునకు డస్ట్‌బిన్ ఉండాలని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజీవ్, శానిటరీ సెక్రటరీలు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకొండ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌కేరాజపురానికి చెందిన మొబైల్ షాప్ నిర్వాహకుడు పైల రామ్మోహన్‌రావు కుటుంబానికి కోటదుర్గమ్మ మొబైల్ అసోసియేషన్ సభ్యులు ఆర్థికసాయం చేశారు. ఇటీవల సీతంపేట మండలంలో జరిగిన రోడ్డుప్రమాదంలో రామ్మోహన్‌రావు మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు రామ్మోహన్‌రావు తల్లిదండ్రులు శ్రీరాములు, చిన్నమ్మడుకు గురువారం మొబైల్ అసోసియేషన్ సభ్యులు రూ.11 వేలు అందజేశారు. కార్యక్రమంలో కోటదుర్గమ్మ మొబైల్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసిరెడ్డి మధుసూదనరావు, ఆనందరావు, చంద్ర, తారకేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకోసం 295 దరఖాస్తులు

సాలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం సాలూరు తహసీల్దార్ కార్యాలయానికి 295 దరఖాస్తులు అందాయి. ఈ మేరకు ఓటు నమోదుకు గడువు బుధవారంతో ముగిసింది.

టీడీపీ నాయకుడు మృతికి సంతాపం

గరుగుబిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లిభద్రకు చెందిన టీడీపీ నాయకుడు మరడాన సాంబమూర్తి (65) మంగళవారం రాత్రి మృతి చెందారు. పంచాయతీలో రెండుసార్లు వార్డు సభ్యుడిగా గెలుపొందారు. ఆయన మృతి పట్ల టీడీపీ నాయకులతో పాటు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మరడాన తవిటినాయుడు, నారాయణ స్వామితోపాటు పలువురు సంతాపం తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీకి గురుకుల విద్యార్థి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భద్రగిరి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న మండంగి కార్తీక్ రాష్ట్రస్థాయి పరుగుపందెం పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం ఏలూరులో జరగనున్న పరుగు పందెం పోటీల్లో కార్తీక్ పాల్గొననున్నాడు.

ప్రతి గ్రామంలో ఫోకల్ స్ప్రే జరగాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మలేరియా పాజిటివ్ వచ్చిన ప్రతి గ్రామంలో ఫోకల్ స్ప్రేయింగ్ జరగాలని(గ్రామమంతా) జిల్లా మలేరియా అధికారి మణి తెలిపారు.బుధవారం దుడ్డుకళ్లు పీహెచ్‌సీలో గల ల్యాబ్‌ను తనిఖీ చేసి వైద్యాధికారి ప్రవీణ్‌తో మలేరియా, డెంగ్యూ గురించి చర్చించారు. దుడ్డుకళ్లులో ఇటీవల మలేరియా పాజిటివ్ కేసులను వచ్చిన బాధితలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, విస్తరణాధికారి సత్యరాజు, సబ్ యూనిట్ అధికారి రాధాకృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి చేయండి

మక్కువ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జనసేనబలోపేతం చేసేందుకు కృషి చేయాలని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ కోరారు.బుధవారం విజయవాడలో జనసేన మండల నాయకులు పెంట తిరుపతిరావు ఆయన్ను కలిశారు. కార్యక్రమంలో జనసేన పార్వతీపురం నియోజకవర్గం ఇన్‌చార్జి మోహన్‌రావు పాల్గొన్నారు.



అమిత్‌షాకు సవర కళా చిత్రపటం

పార్వతీపురం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన సవర కళా చిత్ర పటాన్ని అమిత్‌షాకు అందించారు.

స్పోర్ట్స్ కోటా పెంపుపై హర్షం

పాలకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వోద్యోగాల కల్పనలో స్పోర్ట్స్ కోటా రెండు నుంచి మూడు శాతానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెంచడంపై మన్యం జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పల్లా కొండలరావు, అధ్యక్షుడు కోడిసుదాకర్, ప్రధాన కార్యదర్శి వెన్నపు చంద్రరావు, సంఘం సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తే రూ.ఏడు కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించడంపై ఆనందం వ్యక్తంచేశారు.

నైపుణ్యాభివృద్ధి సర్వేకు ఏర్పాట్లు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి కోసం యువతను ఎంపిక చేయడానికి కావాల్సిన సర్వే కోసం ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీవో సాల్మన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండలంలోని 25 గ్రామ సచివాలయాల సి బ్బందికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వీరంతా అప్పగించిన గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పూర్తిస్థాయి సర్వే చేయనున్నట్లు తెలిపారు.

హెచ్ఎంలకు శిక్షణ రద్దు చేయాలి

బెలగాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు విడతల వారీగా ఇస్తున్న శిక్షణను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళిమోహన్‌రావు ఒక ప్రకటనలో బుధవారం కోరారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం అపార్, ఆధార్ కరెక్షన్, పదో తరగతి నామినల్ రోల్స్, మెగా పేరెంట్స్ మీటింగ్ ఎఫ్ఏ-2 పరీక్షలతో తీవ్ర ఒత్తిడిలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు.